పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించాలి

నిజామాబాద్ అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సెస్సీ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి విద్యార్థులు తమ పరీక్ష ఫీజును చెల్లించాలని ఆన్‌లైన్ ఇన్టిగేషన్ ఏకీకరణ సైబర్ ట్రెజరీ ద్వారా మాత్రమే చెల్లించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, యాజమాన్యాలు ఈ విషయాన్ని గమనించాలని డీఈవో అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 వరకు అపరాధ రుసుము లేకుండా, డిసెంబరు 2వరకు రూ.50 అపరాధ రుసుముతో, రూ.500 అపరాధ రుసుముతో డిసెంబర్ 21 వరకు అవకాశం ఉందని తెలిపారు.



మౌలానా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

నిజామాబాద్ అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భారతరత్న, కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, ఇతర జిల్లా అధికారులు మౌలానా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి అందించిన సేవలను వక్తలు గుర్తు చేసుకున్నారు. దేశ విద్యా వ్యవస్థను తీర్చిదిద్దిన మహనీయుడు అబుల్ కలాం ఆజాద్ అని, 11 ఏళ్లు కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ఆజాద్ ఎనలేని సేవలు అందించి జాతీయ విద్యావిధానాన్ని అమలు చేశారని అన్నారు. రచయితగా, కవిగా, తత్వవేత్తగా, విద్యావేత్తగా, రాజకీయ వేత్తగా అనేక సేవలు అందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి అబుల్ కలాం ఆజాద్ అని కీర్తించారు. ఆయన మైనార్టీ వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా ఆయన పుట్టిన రోజున ప్రతీ సంవత్సరం ప్రభుత్వం జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, డీఆర్‌డీవో సాయాగౌడ్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి నాగోరావు, ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిఘా పెంచాలి

- మహిళల భద్రతకు చర్యలు తీసుకోవాలి
- సమీక్ష సమావేశంలో ఇన్‌చార్జి సీపీ సింధూ శర్మ



అధికారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీపీ సింధూ శర్మ

ఖిల్లా, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెంచి నేరాలను నియంత్రించాలని ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ ఆదేశించారు. నెలవారి సమీక్షలో భాగంగా సోమవారం తన చాంబర్‌లో కమిషనరేట్ పరిధిలోని సిబ్బందితో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ల వారీగా నేరాలపై వివరాలు సేకరించారు. వారికి పలు సూచనలు చేశారు. ఇప్పటి వరకు జరిగిన నేరాల పరిశోధనలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా మహిళల భద్రత కోసం అన్ని రకాల చర్యలు తీసుకోవాలని వారికి భద్రతల విషయంలో ఎల్లప్పుడూ సహకరించాలని తెలిపారు. సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించే విధంగా వారికి అవగాహన కల్పించాలని మోసాల నియంత్రణ కోసం 1930 ఫోన్ నెంబర్ గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. రాత్రి సమయాల్లో వాహన తనిఖీలతో పాటు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఎటువంటి నేరాలు జరగకుండా సంబంధిత అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో నిఘా వ్యవస్థను పటిష్ఠ పర్చాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎన్‌బీడబ్ల్యూ వారెంట్లను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షలో అదనపు పోలీసు కమిషనర్ అడ్మిన్ కోటేశ్వర్‌రావు, అదనపు పోలీసు కమిషనర్ లా అండ్ ఆర్డర్ బస్వారెడ్డి, ఏసీపీ ఎల్.రాజావెంకటరెడ్డి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



- జిల్లాలో ప్రాణహిత చేవెళ్ల ప్యాకేజీల ద్వారా యాసంగిలో 50వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు కసరత్తు
- డిసెంబర్ 25లోపు పనులు పూర్తిచేసి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఏర్పాట్లు
- మంచిప్ప రిజర్వాయర్ నిర్మాణం కోసం రీ సర్వే కొనసాగిస్తున్న అధికారులు

'మంచిప్ప'పై సర్కారు నజర్



నిజామాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ప్రాణహిత చేవెళ్ల ప్యాకేజీల కీలకమైన మంచిప్ప రిజర్వాయర్‌పై ప్రభుత్వం నజర్ పెట్టింది. రిజర్వాయర్ నిర్మాణం చేపట్టడంతో పాటు ఆయకట్టుకు సాగునీటిని అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ముంపు గ్రామాల రైతుల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం రీ సర్వేను చేపట్టింది. రిజర్వాయర్ నిర్మాణం చేస్తే ఎంత మొత్తంలో భూములు పోతాయో పరిశీలిస్తోంది. కొత్తగా నిర్ణయించిన రిజర్వాయర్ ప్రణాళికతో పాటు ప్రాజెక్టు చేపట్టినప్పుడు నిర్ణయించిన పాత రిజర్వాయర్‌కు అనుగుణంగా అధికారులు సర్వేలను కొనసాగిస్తున్నారు. ముంపు గ్రామాల వారికి ఇబ్బందులు లేకుండా నిర్మాణం చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటి వరకు వేసిన పైప్‌లైన్ల ద్వారా రిజర్వాయర్‌కు సంబంధం లేకుండానే సాగునీటిని ఈ యాసంగిలో అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం వేసిన పైప్‌లైన్‌ల ద్వారా శ్రీరాంసాగర్ నీటిని మళ్లించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ యాసంగిలో సుమారు 50వేల ఎకరాల వరకు సాగునీరు అందించేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

వైఎస్ హయాంలో..

ప్రాణహిత చేవెళ్ల ప్యాకేజీ 20, 21, 22 పనులను ఉమ్మడి రాష్ట్రం హయాంలో వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దశాబ్దన్నర క్రితం శంకుస్థాపన చేశారు. సుమారు రూ.350 కోట్లతో పనులను చేపట్టారు. కాంగ్రెస్ హయాంలోనే ఉమ్మడి రాష్ట్ర సమయంలో సొరంగ మార్గాలను పూర్తి చేశారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌పై ఆధారపడి ఉమ్మడి జిల్లాలో 4లక్షల 20వేల ఎకరాకలు సాగునీరు అందించేందుకు ఈ ప్యాకేజీ పనులను చేపట్టారు. నిజామాబాద్ జిల్లాలో 2లక్షల 20వేల ఎకరాలు, కామారెడ్డి జిల్లా పరిధిలో 2లక్షల ఎకరాల వరకు సాగునీరు అందించే విధంగా డిజైన్ చేశారు. ప్రాణహిత చేవెళ్ల ప్యాకేజీలోని 20, 21 పనులు జిల్లాలో చేపట్టగా 22 ప్యాకేజీ పనులు కామారెడ్డి జిల్లా పరిధిలో చేపట్టారు. ఈ ప్యాకేజీ పనులకు కీలకమైన మంచిప్ప రిజర్వాయర్‌ను ఉమ్మడి రాష్ట్రం హయాంలో 0.5 టీఎంసీ కెపాసిటీతో డిజైన్ చేశారు. మంచిప్ప, కొండెం చెరువులను కలిపి రిజర్వాయర్‌గా ఏర్పాటు చేశారు. అప్పుడు కొన్ని పనులను కూడా చేపట్టారు. శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్‌ను బినోల నుంచి సొరంగ మార్గం ద్వారా సారంగపూర్ పంప్‌హౌజ్‌లకు మళ్లిస్తారు. అక్కడి నుంచి నీటిని మోటార్ల ద్వారా నిజాంసాగర్ కెనాల్‌కు మళ్లించి ఈ జిల్లా పరిధిలో ఆయకట్టుకు సాగునీరు అందించే విధంగా ఏర్పాట్లను చేశారు. సారంగపూర్ నుంచి సొరంగ మార్గం ద్వారా మరికొంత నీటిని మంచిప్పకు మళ్లించి జిల్లాలోని సిరికొండ వరకు కాలువల ద్వారా నీటిని మళ్లించేందుకు డిజైన్ చేశారు. మంచిప్ప రిజర్వాయర్ నుంచి టన్నెల్ ఏర్పాటు చేసి కామారెడ్డి జిల్లా పరిధిలోని సదాశివనగర్ మండలం పరిధిలోని పద్మాజివాడ వరకు నీటిని తరలించే విధంగా అప్పుడు డిజైన్ చేశారు. అక్కడి నుంచి కాలువల ద్వారా ఆ జిల్లా పరిధిలో ఆయకట్టుకు నీటిని తరలించేందుకు ఏర్పాట్లను చేశారు.

ప్యాకేజీ పనుల రీడిజైన్

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రాణహిత చేవెళ్ల ప్యాకేజీ పనులను కాళేశ్వరం పథకంలో కలిపారు. ఈ ప్యాకేజీ పనులను రీడిజైన్ చేశారు. మంచిప్ప రిజర్వాయర్‌ను భవిష్యత్తు అవసరాల దృష్టిలో పెట్టుకొని కెపాసిటీని 3.5 టీఎంసీకి పెంచారు. జిల్లా పరిధిలో 21వ ప్యాకేజీ కింద పైప్‌లైన్‌ల ద్వారానే మొత్తం 2లక్షల 20వేల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు రీడిజైన్ చేశారు. మొత్తం ప్రాజెక్టు కాస్ట్‌ను 2600 కోట్లకు పెంచారు. పనులను చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో పైప్‌లైన్‌ల పనులను చేపట్టడంతో పాటు సారంగపూర్ వద్ద పంప్‌హౌజ్ నిర్మాణాన్ని పూర్తి చేశారు. మంచిప్ప వద్ద గడ్కోల్ పంప్‌హౌజ్ నిర్మాణాన్ని చేపట్టారు. పైప్‌లైన్ పనులను 50 శాతం వరకు పూర్తి చేశారు. సారంగపూర్‌తో పాటు మెంట్రాజ్‌పల్లి వద్ద పంప్‌హౌజ్‌లను ఏర్పాటు చేశారు. మంచిప్ప రిజర్వాయర్‌తో సంబంధం లేకుండా నేరుగా శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్ బినోల ద్వారా సారంగపూర్ వరకు తరలించి ఆయకట్టుకు నీళ్లు ఇచ్చే విధంగా ఏర్పాట్లను చేశారు. 21వ ప్యాకేజీ పనులను 21ఏ, 21బి గా డిజైన్ చేసి చేపట్టారు. మంచిప్ప రిజర్వాయర్‌తో సంబంధం లేకుండా 21ఏ పరిధిలో ఆయకట్టుకు పైప్‌లైన్‌ల ద్వారా సాగునీరు అందించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ యాసంగిలో సుమారు 50వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే

మిగతా 8వ పేజీలో...



కన్నుల పండువగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

- గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణం
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

7

వయోవృద్ధుల కోసం ఆయుష్మాన్ భవ



తడపాకల్ గోదావరికి కార్తీక శోభ



తడపాకల్ గోదావరి వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



దీపారాధన చేస్తున్న భక్తులు

ఏర్గట్ల మండలంలోని తడపాకల్ గోదావరి పుణ్యక్షేత్రం వద్ద కార్తీక శోభ సంతరించుకుంది. కార్తీక సోమవారం కావడంతో భక్తులు ఉదయాన్నే గోదావరికి చేరుకొని గంగ స్నానం ఆచరించి ఇసుకతో శివలింగాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ మొక్కులు నెరవేరాలని గోదావరి వద్ద దీపాలు వెలిగించి, ఏలికేశ్వర సీతారామ ఆలయంలో దీపారాధన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి కృష్ణస్వామి, సాయి కుమార్‌లు, మహిళా భక్తులు పాల్గొన్నారు.
- ఏర్గట్ల



బాసర ట్రిపుల్ ఐటీలో.. ఆర్మూర్ విద్యార్థిని ఆత్మహత్య

స్వాతిప్రియ మృతదేహంపై పడి రోదిస్తున్న తల్లి



స్వాతిప్రియ (ఫైల్)

- వర్సిటీ అధికారుల నిర్లక్ష్యం.. సీనియర్ ఇంజనీరింగ్ విద్యార్థి వేధింపులే కారణం !
- తమ కూతురు ఆత్మహత్య చేసుకునే పిరికిది కాదని కుటుంబీకుల వెల్లడి
- పోలీసులతో వాగ్వాదం.. ఘటనపై సమగ్ర దర్యాప్తునకు డిమాండ్

ఆర్మూర్‌టౌన్/బాసర, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన స్వాతిప్రియ (17) అనే విద్యార్థిని సోమవారం నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ట్రిబుల్ ఐటీలో రెండో సంవత్సరం చదువుతున్న తిరుమల కాలనీకి చెందిన పూరి రవీందర్ చిన్న కూతురు స్వాతిప్రియ మృతి చెందడంతో కాలనీవాసుల రోదనలు మిన్నంటాయి. పూరి రవీందర్ ఆక్సిజన్ సిలిండర్‌లు సరఫరా చేసే ఏజెన్సీ నిర్వహిస్తున్నారు. ఈయనకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉండగా, పెద్ద కూతురు సరస్వతి హైదరాబాద్‌లో బీటెక్ చదువుతోంది. కుమారుడు ఓంసాయి నిజామాబాద్‌లో ప్రైవేటు స్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్నాడు. చిన్న కూతురు స్వాతి ప్రియ పెర్కిట్‌లో మోడల్ స్కూల్‌లో విద్యనభ్యసించి ట్రిబుల్ ఐటీలో సీటు సంపాదించింది.

హాస్టల్ గదిలో ఫ్యానుకు ఉరేసుకొని..

సోమవారం ఉదయం తోటి విద్యార్థులు టిఫిన్ కోసం మెస్‌లకు వెళ్లగా.. ఎవరూ లేని సమయం చూసుకొని హాస్టల్ గదిలోని ఫ్యానుకు ఉరేసుకొని ప్రాణాలు విడిచింది. మరో వైపు.. విద్యార్థిని తల్లిదండ్రులు మాత్రం యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యం వల్లే తమ కూతురు చనిపోయిందన్నారు. వర్సిటీలోని ఓ సీనియర్ ఇంజనీరింగ్ విద్యార్థి వేధింపులే కారణమని ఆరోపించారు. ఇదే విషయాన్ని నెల రోజుల క్రితం తమకూతురు ఫిర్యాదు చేసినా.. సదరు విద్యార్థిపై వర్సిటీ అధికారులు చర్యలు తీసుకో లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. విద్యార్థిని ఆత్మహత్య విషయం తెలుసుకున్న ఏబీవీపీ నాయకులు క్యాంపస్ ముట్టడికి యత్నించడం తీవ్రఉద్రిక్తతకు దారి తీసింది. యూనివర్సిటీ సీఐ అత్యుత్సాహం ప్రదర్శించారు. దీంతో ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది ఏబీవీపీ కార్యకర్తలపై కర్రలతో ఇష్టం వచ్చినట్లు దాడి చేశారు. ఈ ఘటనలో పలువురు ఏబీవీపీ కార్యకర్తలకు స్వల్ప గాయాలు కాగా.. ఒకరి తలపగిలి తీవ్ర రక్తస్రావం జరిగింది. కాగా, విద్యార్థిని సాయి ప్రియ తల్లి ఉజ్వల బాసర ఎస్సై గణేష్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఘటనా స్థలి నుంచి మృతదేహన్ని ఎందుకు తరలించావంటూ.. కోపంతో అరుస్తూ ఎస్సై గణేష్ ధరించిన మాస్కును లాగివేసి చొక్కపట్టుకుంది.

మృతిపై అనుమానాలున్నాయి : కుటుంబీకులు

విద్యార్థిని సాయి ప్రియ ఆత్మహత్య చేసుకునే పిరికిది కాదని ఆమె కుటుంబ సభ్యులు వెల్లడించారు. సోమవారం సాయంత్రం భైంసాలోని ఏరియా ఆసుపత్రిలో వారు విలేకరులతో మాట్లాడారు. స్వతహాగా ఎంతో ధైర్యంతో వ్యవహరించే సాయి ప్రియ ఆత్మహత్యకు పాల్పడిందంటే తాము విశ్వసించడం లేదన్నారు. తామెవరూ రాకముందే మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసాకు ఎందుకు తరలించారో అర్థం కావడం లేదన్నారు. మృతిపై తమకు అనుమానాలున్నాయన్నారు. అధికారులు ఘటనపై సమగ్ర దర్యాప్తు, విచారణ చేపట్టి తమ అనుమానాలను నివృత్తి చేయాలన్నారు. ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఎస్సై చొక్కాపట్టుకుని ప్రశ్నిస్తున్న విద్యార్థిని తల్లి

అర్హులకు సంక్షేమ పథకాలు అందించడానికే సర్వే

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



నవీపేటలో కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



ఎన్యూమలేటర్లకు సూచనలు ఇస్తున్న జిల్లా అడిషనల్ కలెక్టర్



ఆర్మూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

నవీపేట,నవంబరు11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడానికే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను చేపట్టడం జరుగుతుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సుభాష్ నగర్ కాలనీలో జరిగిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల వారికి విద్య, ఉద్యోగ, సామాజిక, ఆర్థిక రంగాలలో అభివృద్ధి సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు సంబంధించి అసలు, వడ్డీలను తమ ప్రభుత్వం కట్టాల్సి వస్తుందని అన్నారు. వరిపంటకు రూ.500 చొప్పున బోనస్ చెల్లించడం జరుగుతుందని, అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను త్వరలో మంజూరు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. సర్వేకు వచ్చిన అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా తేజస్విన్ అనే సంవత్సరంన్నర బాలుడిని ఎమ్మెల్యే ఎత్తుకుని మంచి అదృష్టవంతుడు అవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, మోస్రా సాయిరెడ్డి, బాల్‌రాజు గౌడ్, మద్దెపల్లి కిషన్ రావు, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

● సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

రెంజల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేపై ఎటువంటి అపోహలు నమ్మవద్దని అడిషనల్ కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం మండలంలోని సాటాపూర్ గ్రామంలో ఇంటింటి కుటుంబ సర్వేను బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో కలిసి పరిశీలించారు. కుటుంబ సర్వే తీరును పరిశీలించారు. ఎన్యూమలేటర్లు కుటుంబ సభ్యుల వివరాలను తప్పులు లేకుండా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతీ గ్రామంలోని ఇంటింటికి వెళ్లి వాస్తవ సమాచారాన్ని సేకరించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో, తదితరులు పాల్గొన్నారు.

● కుటుంబ సర్వేకు ప్రతీ ఒక్కరు సహకరించాలి: అడిషనల్ కలెక్టర్

బోధన్‌రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించి వివరాలు తెలుపాలని, ఎన్యూమలేటర్లు ప్రజలకు నచ్చజెప్పి సర్వే చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్, ఆచన్‌పల్లి, సరస్వతి నగర్‌తో పాటు మండలంలోని పెగడాపల్లి గ్రామంలో కుటుంబ సర్వేను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల వివరాల సేకరణకై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జరిపిస్తున్న ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు తమవంతు సహకారం అందించాని అన్నారు. సర్వే కోసం ఇళ్లకు వచ్చే ఎన్యూమలేటర్లకు వాస్తవ వివరాలతో కూడిన సమాచారాన్ని అందించాలన్నారు. బోధన్ పట్టణంతో పాటు మండలంలోని పెగడాపల్లి గ్రామంలో సర్వే నిర్వహిస్తున్న తీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని, సమగ్ర సర్వే తీరును పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి ఎన్యూమలేటర్లు వివరాలు ఇంటి యాజమానులకు వివరించి వివరాలు సేకరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అన్ని వర్గాల అభ్యున్నతికి సర్వే ఎంతగానో దోహదపడుతుందన్నారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక ఉపయోగాల కోసం ఈ సర్వే మేలు చేస్తుందన్నారు.ఆయన వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, కమిషనర్ వెంకట నారాయణ, ఎన్యూమలేటర్లు, సంబంధితశాఖ అధికారులు పాల్గొన్నారు.

● కమ్మర్‌పల్లి కులగణన సర్వేను పర్యవేక్షించిన అధికారులు

కమ్మర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య,ఉపాధి,రాజకీయ, కులగణన కుటుంబసర్వే మండంలోని గ్రామాల్లో నిరంతరంగా కొనసాగుతున్నది. ఈమేరకు శిక్షణ పొందిన ఆయా గ్రామాలకు కేటాయించిన ఎన్యూమనేటర్లు ఇంటింటి సర్వే కార్యక్రమంలో పాల్గొంటున్నారు. మండలంలో నిర్వహిస్తున్న సర్వేను మండల ఎంపీడీవో రాజశ్రీనివాస్, తమసీల్దార్ అంజనేయులు సోమవారం మండలంలోని కమ్మర్‌పల్లి, హసాకొత్తూర్, చౌట్‌పల్లి, బషీరాబాద్, గ్రామాలలో పర్యటిస్తూ సర్వే పనులను పర్యవేక్షిస్తూ ఎన్యూమనేటర్లకు తగు సూచనలు సలహాలు అందించారు. సర్వేలో ఎలాంటి తప్పులు దొర్లకుడా జాగ్రత్తగా చేపట్టాలని సూచించారు.ఇదిలాఉండగా సమగ్ర ఇంటింటి సర్వేనిమిత్తం ఇళ్లలో అందుబాటులో ఉండి సర్వే నిమిత్తం వచ్చే ఎన్యూమనేటర్లకు సహకరిస్తూ కుటుంబ సభ్యులకు సంబంధించిన పూర్తి వివరాలను నమోదుచేయించుకోవాలని సూచించారు. వీరివెంట ఏపీఎం కుంట గంగారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సర్వే సిబ్బంది ఉన్నారు.

● సమగ్ర కుటుంబసర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

భీమ్‌గల్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబసర్వేను తప్పులు లేకుండా పకడ్బం దీగా నిర్వహించాలని ఎంపీడీవో సంతోష్‌కుమార్ ఎన్యుమారేటర్‌లకు సూ చించారు. సోమవారం మండలంలోని మెండోర, దేవన్‌పల్లి, పల్లికొండ గ్రా మాలలో సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియను ఎంపీడీవో పరిశీలించారు.ఈ సర్వేకు కుటుంబ సభ్యులు సహకరించాలని అన్నారు. ఆయన వెంట ఆయా గ్రామాల కార్యదర్శులు, సర్వేసిబ్బంది, తదితరులు ఉన్నారు.

● ఆర్మూర్‌లో కొనసాగుతున్న సమగ్ర కుటుంబసర్వే

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మండలంలోని వివిధ గ్రామాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతుంది. సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో సర్వేలో 105మంది ఎన్యుమారేటర్లు ఇంటింటికి వెళ్ళి కుటుంబ వివరాలను సేకరిస్తున్నారు. సర్వే బుక్‌లో సేకరించిన వివరాలను అధికంగా ఉండడంతో ఒక్కోక్క ఇంటి వద్ద కనీసం అరగంట సేపు సమయం పడుతోంది. ఎన్యుమారేటర్లు నిర్వహిస్తున్న సర్వేలో సూపర్‌వైజర్‌లు, అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

● సమగ్ర సర్వేను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని జరుగు తున్న సమగ్ర కుటుంబ సర్వేను మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేను ఆయన 19, 20వార్డులలో పరిశీలించారు. ఆయన వెంట సూపర్‌వైజర్‌లు బాల్‌రాజ్, కృష్ణయ్యలు ఉన్నారు.

● బాల్కొండ, ముప్కాల్‌ల్లో కొనసాగుతున్న సమగ్ర సర్వే

ముప్కాల్:బాల్కొండ, ముప్కాల్ మండలాల్లో కొనసాగుతున్నఇంటిం టి సర్వే కొనసాగుతుంది. ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి జరుగుతున్న సమగ్ర సర్వేను తప్పులు లేకుండా పకడ్బందీగా కొనసాగించాలని ఎన్యుమారేటర్‌లకు సూచించారు.

'విద్యార్థులు ఉన్నత స్థానాలను అధిరోహించాలి'



మోకన్‌పల్లి కేజీబీవీలో మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

నవీపేట,నవంబరు11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మోకన్‌పల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి సబ్జెక్టులో 80శాతానికి పైగా మార్కులు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పాఠశాలలో నెలకొన్న నీటి కొరత, అదనపు గదుల నిర్మాణం, కిటికీలకు జాలీల ఏర్పాటు, బాత్‌రూమ్‌ల మరమ్మత్తుల వంటి సమస్యలను వారం రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఈవో అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, పాఠశాల ప్రత్యేకాధికారిణి కవిత, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

ఆర్మూర్‌రూరల్,నవంబరు11(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో తొలగించిన మధ్యాహ్న భోజన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వ ర్యంలో సోమవారం ఎంఆర్‌సీ ఎదుట ధర్నా నిర్వహించారు. గత కొన్నేళ్లుగా పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంట చేస్తున్న వారిని ఉన్నఫలంగా విధుల నుంచి తొలగించడం అన్యాయమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్‌జహన్, పల్లపు వెంకటేష్ అన్నారు. సంఘటన స్థలానికి సీఐ సత్యనా రాయణగౌడ్, ఎస్సై ఇంద్రకరణ్‌రెడ్డి చేరుకొని సముదాయించారు. అనంతరం సీఐటీయూ నాయకులు తహసీల్దార్ గజానన్‌కు, ఎంఈవో రాజగంగారాంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కుతాడి ఎల్లయ్య, రవి, సాయిలు, కొండ గంగాధర్, భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి: రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు 10వేల గౌరవ వేతనం అందించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వైఓమయ్య డిమాండ్ చేశారు. కోటగిరి మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికుల మండల స్థాయి సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు చక్రపాణి, విఠల్ గౌడ్, వీరేశం, అనసూయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్లలోని కేజీబీవీ ఘటనపై విచారణ



ఎంఈవోతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీలత

ఏర్గట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల భవనంపై నుంచి అంజలి అనే విద్యార్థిని రెండవ అంతస్తు నుంచి పడి గాయాల పాలు కాగా సోమవారం పాఠశాలను తహసీల్దార్ శ్రీలత జరిగిన ఘటనపై విచారణ జరిపారు. విద్యార్థుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వారి రక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతయని, ఇలాంటి ఘటనలు జరగకుండ చూడాలని ఎంఈవో ఆనంద్ రావుకి సూచించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కృష్ణచారి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సధానంద్ పాల్గొన్నారు.

ఇద్దరికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష

బోధన్‌రూరల్,నవంబరు11(ఆంధ్రజ్యోతి): బోధన్ కోర్టులో సోమవారం ఇద్దరు వ్యక్తులకు హత్యాయత్నం కేసులో ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కోర్టు న్యాయాధికారి తీర్పు వెలువరించారని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. 31-05-2021రోజున రాత్రి 7:30గంటల ప్రాంతంలో శక్కర్‌నగర్‌లోని సులభ్ కాంప్లెక్స్ వద్ద సయ్యద్ అస్గర్ అనే వ్యక్తి కాలకృత్యాలు తీర్చుకోవడానికి బయలకు వెళ్లినప్పుడు సతీష్, జావీద్ అనే ఇద్దరు వ్యక్తులు కల్లు సీసాతో కడుపులో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డారని వివరించారు. సోమవారం బోధన్ కోర్టులో కేసు యొక్క పూర్వాపరాధాలు పరిశీలించగా సాక్ష్యాధారాలు నిరూపణ కావడంతో బోధన్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి అజయ్‌కుమార్ హత్య యత్నానికి పాల్పడ్డ జావీద్, సతీష్‌లకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పును వెలువరించారని వివరించారు.

మహాలక్ష్మీకాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఆర్మూర్‌టౌన్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహాలక్ష్మీ కాలనీలో సోమవారం నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. కాలనీలో లోవోల్టేజీ సమస్య ఉండడంతో ఉన్నతాధికారుల సూచన మేరకు 100కెవి ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి 160కెవి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు విద్యుత్ ఏఈ అశ్రితరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ సంతోష్‌నాయక్, సబ్‌ఇంజనీర్ తదితరులు పాల్గొన్నారు.

విజయ్ హైస్కూల్‌లో 43వ టాలెంట్ షో

● హాజరైన సినీనటి యాంకర్ ఉదయభాను, రచయిత్రీ సుశీల

పెర్కిట్, నవంబరు11(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ పట్టణంలోని విజయ్ హైస్కూల్‌లో 43వ టాలెంట్ షోను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సినీనటి యాంకర్ ఉదయభాను, గౌరవ అతిథిగా ప్రొఫెసర్ రచయిత్రీ సీహెచ్.సుశీల పాల్గొన్నారు. విద్యార్థిని విద్యార్థులకు పాఠశాలలో ఆటలలో, పోటీ పరీక్షలలో ప్రతిభ కనబర్చిన వారికి మెమోంటోలు, స్కూల్ టాపర్‌కు డి.ఎల్‌విన్‌కు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం ఇరువురికి విజయ్ హైస్కూల్ యాజమాన్యం ఉదయభాను, సీహెచ్.సుశీలను సన్మానించారు. . ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కవిత దివాకర్, కిరణ్‌బాల, వసంత, ప్రభ, పాఠశాల అధ్యాపక బృందం, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.



సినీనటి యాంకర్ ఉదయభానును సన్మానిస్తున్న విజయ్ హైస్కూల్ యాజమాన్యం

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు జాకోర విద్యార్థిని

వర్ని,నవంబరు11(ఆంధ్రజ్యోతి): వర్ని మండలం జాకోర జిల్లా పరిషత్ విద్యార్థిని గిరి అక్షిత రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైంది. 68వ ఎస్‌జీఎఫ్ యూ 17బాలికల రాష్ట్రస్థాయి హాకీ పోటీలు గ్లోబల్ స్కూల్ దాస్ నగర్‌లో మూడు రోజుల పాటు జరగనున్నాయి. ఈ పోటీలకు అక్షిత ఎంపిక కావడం పట్ల ప్రధానోపాధ్యాయులు అలీం హర్షం వ్యక్తం చేశారు. వ్యాయమ ఉపాధ్యాయులు స్వామి కుమార్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు, అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు.

పేట్‌సంగెంలో వాలీబాల్ రాష్ట్రస్థాయి ఎంపికలు

గాంధారి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్ 14 వాలిబాల్ ఎంపికలను మండలంలోని పేట్‌సంగెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించినట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు లక్ష్మన్‌రాథోడ్ తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన బాలబాలికలు పాల్గొన్నారని తెలిపారు. ఈనెల 16 నుండి 18 వరకు చేగుంటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయని తెలిపారు.ఎంపికలో బాలురు 12,బాలికలు 12 మంది ఎంపికఅయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా వ్యాయమ ఉపాధ్యాయసంఘం బాధ్యులు విద్యసాగర్‌రెడ్డి, సురేష్, గంగామోహన్, శ్రీనివాస్,యాదగిరి,బాలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శక్తిపై అధికారుల పొలంబాట

బోధన్‌రూరల్,నవంబరు11(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని ఊట్‌పల్లి శివారులోని పంట పొలాల్లో సోమవారం విద్యుత్ శాఖ అధికారులు పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ టెక్నికల్ డీఈ రమేష్ మాట్లాడుతూ.. విద్యుత్ శక్తిపై రైతులకు అవగాహన కల్పించడం కోసం పొలంబాట కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ బోధన్ డీఈ ముక్తార్ హైమద్, ఎడపల్లి ఏడీఈ ప్రభాకర్, ఏఈ మారుతి, లైన్ ఇన్స్‌స్పెక్టర్ శివప్రసాద్, లైన్‌మెన్‌లు రామకృష్ణ, వెంకటేష్, మహేందర్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి చెరువులో చేప పిల్లల విడుదల

కోటగిరి,నవంబరు11(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలోని దామర చెరువులో సోమవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో 92,780 చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ హన్మంతు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వంద శాతం రాయితీపై చేప పిల్లలను అందించడం జరుగుతుందన్నారు. మత్స్యకారుల జీవనోపాధిని పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ గంగాధర్, నాయకులు బర్ల మధు తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు

ముప్కాల్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): బాల్కొండ, ముప్కాల్ మండలాల్లో కార్తికమాసం సోమవారం కావడంతో శైవక్షేత్రాల్లో భక్తులతో కిటకిటలాడాయి. కార్తిక మాసానికి ఒక విశిష్టత ఉందని, సోమవారం అత్యంత భక్తిశ్రద్ధతో ఉపవాస దీక్షలతో ఉండి సైవక్షేత్రాలను దర్శించుకుంటే శుభాలు జరుగుతా యని భక్తుల నమ్మకం. కార్తిక సోమవారం కావడంతో నది తీరాలకు వెళ్ళి పుణ్యస్నానలు ఆచరించి కార్తిక దీపాలను వదిలి అనంతరం శివాలయంలో దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి దీపోత్సవాలు నిర్వహించారు.

చెరువులో పడి వ్యక్తి ఆత్మహత్య

నవీపేట,నవంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతగిరికి చెందిన గౌరు ప్రదీప్(38)అనే వ్యక్తి ఆదివారం రాత్రి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ వినయ్ తెలిపారు. ప్రదీప్ గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడని, మద్యం సేవించడం మానివేయాలని పెద్ద మనుషులతో చెప్పించిన అతడు తన పద్ధతి మార్చుకోలేదని అన్నారు. ఆదివారం రాత్రి మద్యాన్ని సేవించిన ప్రదీప్ తాను జలాల్‌పూర్ శివారులోని పోతడి కుంట చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నానని భార్యకు ఫోన్ చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. బైక్‌పై వెళ్లిన అతడు అదే రాత్రిజలాల్‌పూర్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకోగా అతడి మృతదేహం సోమవారం లభ్యమైందని ఎస్ఐ పేర్కొన్నారు.మృతుడికి భార్య మీనా, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దివ్యాంగులకు రూ.10వేల పింఛన్ ఇవ్వాలి

బోధన్‌రూరల్,నవంబరు11(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగులకు 10వేల పింఛన్ అందించాలని సోమవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ అధ్యక్షులు యేశాల గంగాధర్ మాట్లాడుతూ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వేలో 21రకాల వికలాంగుల వివరాలు సేకరించాలని కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బోధన్ సబ్ కలెక్టర్‌కు జిల్లా కమిటీ తరఫున వినతిపత్రం అందించడం జరిగిందన్నారు. కుటుంబ యాజమాని, కుటుంబ వ్యక్తిగత వివరాలు సేకరించడంతో పాటు నెంబర్ కాలంలో మీరు దివ్యాంగులా అని అడిగారని, వికలాంగుల 2016 హక్కుల పరిరక్షణ చట్టం 21రకాల వైకల్యాలను గుర్తించిందన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శితో పాటు దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

అబుల్ కలాం ఆజాద్ అడుగు జాడల్లో నడవాలి



కోటగిరిలో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాస్ రావు

కోటగిరి,నవంబరు11(ఆంధ్రజ్యోతి): భారత దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అడుగుల్లో ప్రతి ఒక్కరు నడవాలని కోటగిరి ఎంఈవో శ్రీనివాస్ రావు సూచించారు. కోటగిరి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగాధర్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు బర్ల సాయిలు, ప్రధాన కార్యదర్శి ఉదయ్ చందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అర్షద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: నేటి యువత మౌలానా అబుల్ కలాం ఆజాద్ అడుగు జాడల్లో నడవాలని బోధన్ మాజీ మున్సిపల్ ఛైర్మన్ గౌసోద్దీన్ అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని మైనారిటీ పాఠశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నేటి యువత మౌలానా అబుల్ కలాం ఆజాద్ అడుగు జాడల్లో నడవాలన్నారు. దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్య అభివృద్ధి కోసం అనేక విధాలుగా కృషి చేశారని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పాషా మొయినోద్దీన్, ప్రిన్సిపాల్ వహీద్, సనా పటేల్, మైనారిటీ పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: భారతరత్న కేంద్ర తొలి విద్యశాఖ మంత్రి అబుల్ కలాం అజాద్ జయంతి వేడుకలను సోమవారం బాల్కొండ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ చందన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేశానికి చేసిన సేవలు, దేశ విద్య వ్యవస్థను తీర్చిదిద్దిన మహనీయుడని కొనియాడారు. 11ఏళ్ల విద్యశాఖ మంత్రిగా అజాద్ ఎనలేని సేవలు చేశారన్నారు. జాతీయ విద్యావిదానం అమలు చేశారని, రచయితగా, కవిగా, విద్యవేత్తగా, తత్వవేత్తగా, రాజకీయ వ్యక్తిగా సేవలు అందించిన మహాముఖ ప్రజ్ఞాశాలి అని కీర్తించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సయ్యద్ మజారుద్దిన్, మార్కజ్ కమిటీ జాయింట్ సెక్రెటరీ సయ్యద్ శంశోద్దిన్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మోర్తాడ్: భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి మౌలాన అబుల్ కలాం అజాద్ జయంతి వేడుకలను మైనారిటీ నాయకులు ఘనంగా నిర్వహించారు. సోమవారం మండల కేంద్రంలోని మైనారిటీ షాదిఖానలో జిల్లా మాజీ వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ నజీర్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పుప్పాల అశోక్, వీడీసీ అధ్యక్షుడు జంగం అశోక్, ఎఎంసీ డైరెక్టర్ మహిపాల్‌రెడ్డి, విక్రంగౌడ్, జమాల్, హర్షద్, మైనారిటీ సంఘ పెద్దలు, ఉర్దూ జర్నలిస్టులు పాల్గొన్నారు.

రెంజల్: జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో సోమవారం మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో ఆంజనేయులు మాట్లాడుతూ. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హర్షియా నజ్మా, పాల్గొన్నారు.

15 వరకు ఓపెన్ యూనివర్సిటీ అడ్మిషన్‌లు

ఆర్మూర్‌టౌన్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ మొదటి సంవత్సరం చేరుటకు ఈనెల 15వ తేదీ వరకు అడ్మిషన్‌లు పొందడానికి అవకాశం కల్పిస్తున్నట్లు డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వేణు ప్రసాద్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 7382929785నెంబర్‌కు సంప్రదించాలని ఆయన తెలిపారు.

లింబాద్రిగుట్ట జాతరకు ప్రత్యేక బస్సులు

పెర్కిట్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణం నుంచి భీమ్‌గల్ లింబాద్రిగుట్టకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని ఆర్మూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ పి.రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14నుంచి 17వ తేదీ వరకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని, ప్రయాణికుడే ఆర్టీసీ బస్సులలో ప్రయాణించి సురక్షితంగా సుఖవంతంగా ఉండాలని ఆయన తెలిపారు.

అక్రమ కోకాలు, పండ్ల దుకాణాల తొలగింపు

ఆర్మూర్‌టౌన్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తబస్టాండ్ ప్రాంతంలో రోడ్డు ఆక్రమించి ఉన్న కోకాలు, పండ్ల బండ్లను మున్సిపల్ అధికారులు, స్థానిక పోలీసులు తొలగించారు. కొత్తబస్టాండ్ ప్రాంతంలో చిరు వ్యాపారులు రహదారిని ఆక్రమించుకొని ఇష్టరాజ్యంగా కోకాలు, పండ్ల దుకాణాలు నిర్వహిస్తున్నారు. మడిగెలలో వ్యాపారులు చేసుకొనే వారు తమ దుకాణాల ముందు పండ్ల దుకాణాలు, ఇతర దుకాణాలకు అనుమతినిస్తూ వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తుంటారు. దీని వల్ల రోడ్డు ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.ఈ కార్యక్రమంలో టీపీవో ఆంజనేయులు. ఎస్సై ఇంద్రకరణ్‌రెడ్డి, ఎఎస్సై లక్ష్మణ్, చిన్నయ్య, సానిటరీ ఇన్స్‌పెక్టర్ గజానంద్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



ఆర్మూర్ ఆర్టీసీ ప్రాంతంలో జేసీబీతో కోకాలను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

రేషన్ బియ్యం పట్టివేత

బిచ్కుంద,నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పీడీఎస్ బియ్యాన్ని ప్యాసింజర్ ఆటోలోతరలిస్తుండగా రాజుల్ల పెట్రోల్ పంపు వద్ద పట్టుకున్నట్లు ఎస్ఐ మోహన్ రెడ్డి తెలిపారు. 20 బస్తాల బియ్యంను స్వాధీనం చేసుకుని తరలిస్తున్నవారిపై కేసులు మోదుచేశామని ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మండలంలోని ఖత్‌గావ్ మంజీర పరివాహక ప్రాంతం నుండి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ మోహన్‌రెడ్డి తెలిపారు. అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ యాజమాని, డ్రైవర్లపై కేసు నమోదుచేసి ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

జోరుగా కొనసాగుతున్న రోడ్డు పనులు

దోమకొండ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి):దోమకొండ నుంచి బిక్కనూర్ వరకు తారు రోడ్డు నిర్మాణంకు పనులు జోరుగా కొనసాగుతున్నాయి. దోమకొండ, గొట్టిముక్కల, లక్ష్మీదేవునిపల్లి, బిక్కనూర్ వరకు సుమారు 8 కిలోమీటర్ల దూరం రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. మరి కొన్ని రోజుల్లో రోడ్డు పనులు పూర్తి కానున్నట్లు సిబ్బంది తెలిపారు.

విధుల్లో చేరిన దోమకొండ ఏవో

దోమకొండ నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):దోమకొండ మండల వ్యవసాయాధికారిణి మణిదీపిక సోమవారం విధుల్లో చేరారు. ఇటీవలే ప్రభుత్వం వ్యవసాయశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయగా ఆమె దోమకొండ ఏవోగా నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఏఈవోలు క్రిష్టారెడ్డి, మాన్యూష, సెంటర్ నిర్వహకులు ప్రమోద్, గూలాం, రైతులు పాల్గొన్నారు.

వెల్మల్‌లో సుభాష్ పత్రీజీ జన్మదిన వేడుకలు

నందిపేట, నవంబరు11(ఆంధ్రజ్యోతి): నందిపేట మండలం వెల్మల్ గ్రామంలో సోమవారం జగద్గురు బ్రహ్మర్షి సుబాష్ పత్రాజీ జన్మదిన వేడుకలను పీఎస్ఎస్ఎం నిజామాబాద్ వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీరమిడ్ మాస్టర్ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ప్రతీఒక్కరు ధ్యానం చేసి పిరమిడ్ శక్తిని ఉపయోగించి శాఖహారాన్ని భుజించి జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణరెడ్డి, జిల్లా బాధ్యులు, రిటైర్డు డీపీవో బొడ్డు దయానంద్, లక్ష్మణ్, చిన్నయ్య, నరేందర్, భోజన్న, భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

గడుగు గంగాధర్‌ను సన్మానం

జక్రాన్‌పల్లి, నవంబరు11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్‌ను సోమవారం జక్రాన్‌పల్లి మాజీఎంపీపీ కె.అనంత్‌రెడ్డి కలిశారు. అనంతరం గడుగు గంగాధర్‌ను మాజీఎంపీపీ కె.అనంత్‌రెడ్డి శాలువ, బోకెతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం..శ్రీ లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

భీమ్‌గల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దక్షిణ బద్రినాథ్‌గా పేరు పొందిన నింబాచల క్షేత్రంపై శ్రీలక్ష్మీనర్సింహ స్వామి కల్యాణం సోమవారం ఆలయ ధర్మకర్త నంబి పార్థసారథి విజయసారథి ఆధ్వర్యంలో ఘనంగా చేపట్టారు. నిజామాబాద్ జిల్లాలోని ప్రసిద్ధి చెందిన నింబాచల క్షేత్రంపై శ్రీవారి బ్రహ్మోత్సవాలు అంగరంగా వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా దేవదేవుని కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుని కల్యాణం తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు.



లింబాద్రిగుట్టపై స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



లింబాద్రిగుట్టపై స్వామివారి కల్యాణం తిలకిస్తున్న మహిళలు

శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం..

శ్రీలక్ష్మీనర్సింహస్వామి మూల విరాట్ కల్యాణ మహోత్సవం గర్భాలయంలో ఉదయం 8.30 గంటలకు ప్రధాన యాగ్నికులచే జరిపారు. తదుపరి స్వర్ణాలంకార భూషితులైన శ్రీలక్ష్మీ నర్సింహుని ఉత్సవ విగ్రహాలను మంగళ వాయిద్యాలు మొగుతుండగా గర్భాలయం నుంచి కల్యాణ మండపంనకు పుష్పమాలికాలతో అలంకరించిన పల్లకిలో భక్తజనం గోవింద నామస్మరణతో తోసుకొచ్చారు.

కల్యాణ క్రతువు..

కల్యాణోత్సవంలో మొదటిదైన కలశపూజ, విశ్వక్షేన పూజ నిర్వహించి శ్రీలక్ష్మీ నర్సింహులకు రక్షా బంధనం గావించారు. మంత్ర సంస్కార మొనర్చిన యగ్నోపవిత ధారణ గావించి ఆయన పాద చిహ్నం గల శఠగోపమునకు ప్రత్యద్విష్ణు అనే మంత్రంతో పాద ప్రక్షాళన గావించి స్నానమొనరిచారు. పెరుగు, తేనె కలిపిన మధు పర్కాన్ని స్వామి వారికి తాగించారు.

కన్యాదాన సంకల్పం..

కన్యాదానం చేసిన పితరులు నరకాన్ని వీడి పుణ్యలోకం చేరుకుందురు. కన్యాదాన వైభవం తిలకించిన సమస్త భక్తులకు పుణ్యలోక ప్రాప్తి దొరుకుతుందని అర్చకులు వివరించారు. కన్యాదానంలో భాగంగా శ్రీలక్ష్మీనర్సింహుని దోసిలిపై శ్రీ లక్ష్మీదేవి దోసిలి నుంచి మనుభావనచే అర్చకులు తమ దోసిలిలో కన్యాం కనక సంపన్నాం అనే శ్లోకాలు పటిస్తూ సంతత ధార జలాలతో స్వామి వారికి అమ్మవారిని కన్యాదానం చేశారు.

తదేవ లగ్నం సుదీనం తదేవ..

శ్రీలక్ష్మీనర్సింహుని శ్రీలక్ష్మీదేవిని ఒకరికి ఎదురుగా స్వస్తిక చిన్నాహులు గల కల్యాణ పీఠాలపై కూర్చుండ బెట్టారు. ఇద్దరి మధ్య తెర ఉంచి మంగళవాయిద్యాలు మోగుతుండగా తదేవ లగ్నం సుదిలం తదేవ మొదలగు వివాహ మంగళా ష్టకములు జపిస్తూ ఆయన పాదములైన శఠ గోపంపై ముత్యాలతో కూడిన తలంబ్రాలను సమర్పించారు. విశ్వ సృష్టి లయ కారకుడైన శ్రీలక్ష్మీ నారాయణుని మీద తలంబ్రాలు వేసే అధికారం మానవ మాత్రులకు లేనందున ఆయన పాదాలపై తలంబ్రాలు సమర్పించారు.

ధృవంతే రాజా..

ధృవంతే రాజా అనుమంత్రముచే శఠ గోపముపై జీలకర్ర బెల్లం కలిపిన ముద్దను ప్రధాన అర్చకుడు సమర్పించారు. పట్టువస్త్రాలు, పూల బాషింగాలు, బంగారు బాషింగాలు చేర్చి మంగళవాయిద్యాలు మొగుతుండగా స్వామికి సమర్పణ చేశారు.

మాంగల్యం తంతు నానేన..

సంకల్ప యుక్తంగా మాంగల్య పూజ గావించారు. సుహాసినులు, సమస్త భక్తులు పవిత్రమైన మాంగళ్యం మొక్కుతుండగా శుభప్రదమైన మంగళవాయిద్యాలు మోగుతుండగా మాంగల్య తంతునానేన అను శ్లోకం వేద పండితులు పట్టించుచుండగా శ్రీలక్ష్మీనర్సింహుల వారు తన దేవేరీయైన అమ్మవారి మెడలో మంగళ సూత్రం కట్టారు. వధూవరులు ఒకరి శిరస్సుపై ఒకరు దోసిలితో అక్షింతలు పోసుకున్నారు. దీనిని అక్షత దోపణం అంటారు. అర్చకులు శ్రీస్వామి శఠగోపంపై మంత్రాలు ఉచ్చరిస్తూ శ్రీ స్వామి తలపున అక్షింతలు సమర్పించారు. తదుపరి బ్రహ్మముడి వేశారు. ఆశీర్వచనాది పనసలను చదివి కల్యాణం తిలకించిన భక్తులకు ప్రసాద అక్షింతలు ఇచ్చి అర్చకులు ఆశీర్వదించారు. కల్యాణ వేడుకల అనంతరం రాత్రికి వివాహ స్థాలీపాక హోమం నిర్వహించారు. శ్రీలక్ష్మీ నర్సింహుని కల్యాణ మహోత్సవం కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



పల్లకీసేవలో శ్రీలక్ష్మీనర్సింహస్వామివారు



లింబాద్రిగుట్టపై క్యూలో నిల్చున్న భక్తులు



శ్రీలక్ష్మీనర్సింహుని కల్యాణోత్సవాన్ని జరుపుతున్న వేదపండితులు



లింబాద్రిగుట్టపై ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

లింబాద్రిగుట్ట బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ప్రముఖులు

భీమ్‌గల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింబాద్రిగుట్టపై కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో సోమవారం లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవానికి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా స్వామివారిని దర్శించుకున్నారు. లింబాద్రిగుట్టపై జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో ఆలయ ధర్మకర్త నంబి పార్థసారథి, విజయసారథిలు ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణకు శాలువతో సన్మానించారు. బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సతీమణి నీరజారెడ్డి కుటుంబసభ్యులతో కలిసి పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో లక్ష్మీనర్సింహస్వామి వారికి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సతీమణి నీరజారెడ్డి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు.



లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సతీమణి నీరజారెడ్డి

వయోవృద్ధుల కోసం
ఆయుష్మాన్ భవ



వృద్ధుల కోసం హెల్త్ కార్డు

మద్నూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశంలో వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భవ అనే పథకాన్ని ప్రారంభించింది. ప్రస్తుతం నిరుపేదలకు ఉచిత వైద్యం కోసం కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ కార్డులు ఇస్తున్న రీతిలోనే ప్రత్యక్షంగా 70 ఏళ్ల పైనున్న వారి ఆరోగ్య రక్షణ కోసం కూడా కార్డులను ఇవ్వబోతుంది. ఈ కార్యక్రమంలో గత నెల 23వ తేదీ నుంచి అమలు చేస్తుండగా రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము వర్చువల్‌గా ఈ కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా ప్రారంభించారు. ఐదు లక్షల మేరకు ఉచిత ఆరోగ్య పథకాన్ని ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన అందుబాటులోకి తీసుకొచ్చారు. 70 ఏళ్ల పైనున్న వారు ఈ ఆయుష్మాన్ భవ పథకం కింద లబ్ధి పొందే అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా సేవలు అందిస్తుంది. ఈ పథకం కింద 1835 రకాల వ్యాధులకు చికిత్స అందిస్తున్నారు. కేంద్రం ప్రస్తుతం ప్రారంభించిన ఆయుష్మాన్ భవ పథకాన్ని వృద్ధులకు కేంద్రం అందజేస్తుంది. దీంతో ఈ పథకం కింద ఆసుపత్రిలో వైద్య పరీక్షలు, చికిత్స ఇంటెన్సివ్ కేర్ తదితర సేవలను పొందవచ్చు. ఉచితంగా మందులు పోషక ఆహారం సైతం అందజేస్తారు. ఈ పథకం కోసం వృద్ధులు పూర్తి వివరాలతో వెబ్‌సైట్‌లోను దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

● హెల్త్ ఇన్సూరెన్స్ ఉన్న వారికి కూడా...

ఇప్పటికే ఆయుష్మాన్ కార్డు కలిగి ఉన్న వృద్ధులు ఆయుష్మాన్ పోర్టల్ లేదా యాప్‌లో మళ్లీ దరఖాస్తు చేసుకుని కొత్త కార్డు కోసం ఈ కేవైసీ పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రైవేట్ హెల్త్ ఇన్సురెన్స్ పాలసీలు, లేదా ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ స్కీం పొందుతున్న సీనియర్ సిటిజన్‌లు కూడా ఈ పథకం కింద ప్రయోజనాలు పొందేందుకు అర్హులు. కేంద్ర ప్ర భుత్వ ఆరోగ్య పథకం ఎక్స్ సర్వీస్‌మెన్, కంట్రిబ్యూటర్ హెల్త్ స్కీమ్, ఆయుష్మాన్, సెంట్రల్ ఆర్మీ పోలీస్ ఫోర్స్ వంటి ఇతర పబ్లిక్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్‌లను ఉపయోగిస్తున్న 70 ఏళ్ల పైనున్న సీనియర్ సిటిజన్ సైతం పథకం లేదా ఆయుష్మాన్ భారత్ స్కీమ్‌లలో ఏదో ఒక దాన్ని ఎంచుకోవాల్సి ఉంటుంది.

● ఇంటి వద్దే ఆరోగ్య పరీక్షలు

ఆయుష్మాన్ భారత్ కింద పేర్లు నమోదైన వయో వృద్ధులు ఇళ్లకు వెళ్లి వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షల వివరాలను ఆయుష్మాన్ భవ ఖాతాలో నమోదు చేస్తారు. ఆసుపత్రికి వెళితే వాటిని పరిశీలించి డాక్టర్లు వైద్యం అందజేస్తారు. ఏదైనా సందర్భంలో వేరే ఆసుపత్రులకు వెళ్లి రోగుల వద్ద పాత వైద్య రిపోర్టులు లేకపోయినా ఆయుష్మాన్ భవ హెల్త్ ఖాతా సంఖ్య ఆధారంగా వైద్యులు చికిత్స అందజేస్తారు.



వైశ్యా భవన్ ఎదురుగా రోడ్డు పక్కన చెత్త వేస్తున్న దృశ్యం



3వ వార్డు పరిధిలో ఖాళీ స్థలంలో పేరుకుపోయిన మురికి నీరు, పిచ్చి మొక్కలు

ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో పారిశుధ్యం అస్తవ్యస్తం

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఎల్లారెడ్డి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పారిశుధ్యం లోపంతో అస్తవ్యస్తంగా తయారైంది. పారిశుధ్య పనులను పర్యవేక్షించాల్సిన మున్సిపల్ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదని విమర్శలు వ్యక్త మవుతున్నాయి. ప్రధానంగా పట్టణంలోని పలు కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక మురుగు నీరు నిలిచి కంపుకొడుతున్నట్లు కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇళ్ల మధ్యలో మురుగు నీరు నిలువ ఉండటంతో దోమల బెడద అధికమై ప్రజలు మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, టైఫాయిడ్‌తో పాటు తదితర వ్యాధుల బారిన పడుతున్నారు. వర్షాకాలం ముగిసిన పట్టణంలో ప్రజలు ఇప్పటికీ సీజనల్ వ్యాధులతో బాధపడుతూనే ఉన్నారు. పట్టణంలోని పారిశుధ్య పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పట్టణంలోని మూడవ వార్డు కాలనీలో ఖాళీ స్థలంలో మురికి నీరు చేరడం వల్ల దోమలతో ఇబ్బదులు ఎదుర్కొంటున్నారు. పదో వార్డు పరిధిలో వైశ్యా భవన్ ముందు ప్రాంతంలో ఖాళీ స్థలాలలో వ్యర్థాలు వేయడం, అదేవిధంగా 11, 12వ వార్డు పరిధిలో మురికి కాలువలు శుభ్రం గా లేకపోవడంతో సహకార సంఘం పక్కన రోడ్డు మీద మురికి నీరు ప్రవహిస్తుంది. అంతేకాకుండా ఖాళీ స్థలాల్లో మురుగు నీరు నిలిచి ప్రాంతాలు కంపు కొడుతున్నాయి. కాలనీ వాసులు పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు, స్వచ్ఛతాహీ సేవా, ఫ్రైడే డ్రై డే కార్యక్రమాలు నిర్వహించినప్పుడు మాత్రమే కొన్ని కాలనీలలో మున్సిపల్ అధికారులు హంగామా చేసి శుభ్రం చేసి ఉన్నతాధికారుల దృష్టిలో పడేలా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతే తప్పా మున్సిపాలిటీలో పారిశుధ్యం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు పారిశుధ్యంపై దృష్టి సారించాలని కోరుతున్నారు.



రోడ్డు పక్కన చెత్తాచెదారం





పాతబస్టాండ్ సమీపంలో రోడ్డుపై సంచరిస్తున్న కుక్కలు

హుస్నాబాద్‌గల్లీలో రోడ్డుపై అడ్డంగా ఉన్న కోతుల మంద

ఆర్మూర్‌లో కుక్కలు, కోతులతో అవస్థలు

- బయటకు వెళ్లాలంటే జంకుతున్న ప్రజలు

ఆర్మూర్‌టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని కుక్కలు, కోతులతో ప్రజలు అవస్థలు పడుతూ భయాందోళనకు గురువుతున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. చిన్న పిల్లలు స్కూల్ వెళ్లేటప్పుడు ఎక్కడ ఏ కుక్కనో కోతియే కాటు వేస్తుందని తల్లిదండ్రులు భయపడుతూ బడికి పంపిస్తున్నారు. అలాగే తల్లిదండ్రులు కర్ర లేకుండా వీధుల్లో తిరగలేని దుస్థితి ఏర్పడింది. గతంలో కుక్క కాటుకు, కోతి కాటుకు మంచన పడ్డవారు చాలా మంది ఉన్నారు. కాలనీలోని ప్రధాన కూడలిలలో కుక్కలు మాటు వేయగా ఇళ్లపై కోతులు వేచి చూస్తున్నాయి. ప్రతీనెల సుమారు 250 మందికి పైగా కుక్క, కోతిల కాటువల్ల చికిత్స చేయించుకుంటున్నారు. ప్రతీ వార్డులోని ప్రధాన కూడలిలో సుమారు పది నుంచి 20కుక్కలు ఉండగా, ఇళ్లపైన సుమారు వందకు పైగా కోతులు ఉండడంతో ప్రజలు ఏమి చేయలేని స్థితిలో నిమ్మకుండిపోతున్నారు. మున్సిపల్‌లో పలుమార్లు ఫిర్యాదు చేసిన అధికారులు గాని, నాయకులు గాని పట్టించుకున్న దాఖలాలు లేవు. కుక్కలను జిల్లా కేంద్రంలోని ఏబీసీ సెంటర్‌కు తరలించి శస్త్రచికిత్సలు చేయిస్తున్నామని చెబుతున్నారు తప్ప ఆచరణలో సాధ్యం కావడం లేదన్నారు. అలాగే కోతుల బెడద తీర్చడానికి మున్సిపల్ సమావేశంలో తీర్మానం చేయాల్సి ఉంది. కానీ ఇటీవల మున్సిపల్ సమావేశం నిర్వహించక పోవడంతో ప్రజలు, కుక్కలు, కోతుల బెడదతో నరకయాతన పడుతున్నారు. పట్టణంలోని సిద్దులగుట్ట, పోచమ్మగుట్టలో నివసిస్తున్న కోతులు వాటి ఆకలి దాహార్తిని తీర్చుకోవడానికి మీదిబజార్, కిందిబజార్, ఔట్‌గల్లీ, హుస్నాబాద్‌గల్లీ, రాంనగర్, జిరాయత్‌నగర్‌లతో పాటు మామిడిపల్లి ప్రాంతాల్లో సంచరిస్తున్నాయి. దీంతో ఆయా కాలనీల్లో వేకువ జాము నుంచి కోతుల బెడదతో, అలాగే రాత్రి 8 గంటల నుంచి కుక్కల బెడదతో పిల్లలను బయటకు పంపించలేని దుస్థితి ఏర్పడింది. ప్రతీ ఇంటి వద్ద ఒక పెద్ద కర్రను ఏర్పాటు చేసుకొని కుక్కలు, కోతుల భారీ నుంచి సంరక్షించుకుంటున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు కుక్కలు, కోతుల బెడద నుంచి సంరక్షించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

మంచిప్ప రిజర్వాయర్‌పై నజర్

(ఐదో పేజీ తరువాయి)

విధంగా ప్రణాళికను రూపొందించారు. డిసెంబర్ 25 లోపు కొంతమేర పనులను పూర్తిచేసి పైప్‌లైన్‌ల ద్వా రా అందించేందుకు సిద్ధమవుతున్నారు. శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్‌ను బినోల ద్వారా సారంగపూర్ పంప్ హౌజ్‌లకు మళ్లిస్తారు. అక్కడి నుంచి మోటార్ల ద్వారా నీటిని ఎత్తి నిజాంసాగర్ కాలువలకు మళ్లి స్తారు. ఆ నీటిని మెంట్రాజ్‌పల్లి వరకు తరలించి అక్కడ మోటా ర్ల ద్వారా పైప్‌లైన్‌లకు నీటిని విడుదల చేస్తారు. రై తులు వేసే పంటలకు అనుగుణంగా ఆయకట్టుకు నీటిని అందిస్తారు. ప్రస్తుతం కొంతమేర పనులు పూ ర్తయినందున అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ముంపునకు తొమ్మిది తండాలు

ఈ ప్యాకేజీ పనులకు అత్యంత కీలకమైనది మంచిప్ప రిజర్వాయర్. ఈ ప్రాజెక్టును గత ప్రభుత్వం చేసిన విధంగా రీడిజైన్‌కు అనుగుణంగా నిర్మాణం చేస్తే మంచిప్ప గ్రామంతో పాటు సుమారు తొమ్మిది తండాలకు చెందిన భూములు ముంపునకు గురవుతున్నాయి. వారు నిర్వాసితులు అవుతున్నారు. మంచిప్ప రిజర్వాయర్‌ను ఉమ్మడి రాష్ట్ర హయాంలో నిర్ణయించిన విధంగా నిర్మాణం చేస్తే నిర్వాసితులకు నష్టం ఉండదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు ప్రభుత్వ ఆదేశాలతో సాగునీటి శాఖ అధికారులు మళ్లీ రీసర్వే చేపట్టారు. రెండు డిజైన్‌లకు అనుగుణంగా ఎంత మొత్తంలో రైతుల భూమి పోతుందో అంచనాకు వస్తున్నారు. రీ సర్వే చేయడంతో పాటు భూములు, ఇండ్లతో పాటు ఎంత మంది నిర్వాసితులు అవుతున్నారో వివరాలను సేకరిస్తున్నారు. పూర్తిస్థాయిలో సర్వే పూర్తయిన తర్వాత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రిజర్వాయర్‌పై నిర్ణయం తీసుకోనున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన తర్వాత ఆయా గ్రామాల పరిధిలో సమావేశాలు నిర్వహించి వారి నుంచి విజ్ఞప్తులను స్వీకరిస్తారు. మంచిప్ప రిజర్వాయర్ కోసం నోటిఫికేషన్ ఇచ్చి నిర్మాణం చేపడుతారు. నిర్వాసితులకు పరిహారాన్ని అందిస్తారు. గత ప్రభుత్వ హయాంలో మూడేళ్ల పాటు ఆందోళనలు నిర్వహించి ప్రాజెక్టు సర్వేను ముంపు గ్రామాల ప్రజలు అడ్డుకోవడం వల్ల ఈ దఫా ఇబ్బందులు రాకుండా ఉండేందుకు రీ సర్వేను కొనసాగిస్తున్నారు. పాత డిజైన్ ప్రకారం నిర్మాణం చేస్తే గ్రావిటీ ద్వారా ఆయకట్టుకు సాగునీటిని అందించే అవకాశం ఉండటంతో ఈ సర్వేను కొనసాగిస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి బ్యాక్ వాటర్ నీటిని అందించేందుకు ఈ ఏర్పాట్లను చేస్తున్నారు. జిల్లాలో కాళేశ్వరం ప్యాకేజీల ద్వారా ఈ యాసంగిలో సాగునీటిని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సాగునీటి శాఖ సీఈ మధుసూదన్‌రావు తెలిపారు. పైప్‌లైన్‌ల నిర్మాణం కొంతమేర పూర్తయినందున 50వేల ఎకరాలకు ఈ యాసంగిలో సాగునీటిని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మంచిప్ప రిజర్వాయర్‌పై కూడా రీసర్వే కొనసాగిస్తున్నామని ఆయన తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట రెవెన్యూ ఉద్యోగుల ఆందోళన

- వికారాబాద్ కలెక్టర్‌పై దాడిని ఖండిస్తూ నల్ల బ్యాడ్జీలతో నిరసన

నిజామాబాద్ అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా దూద్యాల మండలం లగచర్లలో ఆ జిల్లా కలెక్టర్‌తో పాటు తహసీల్దార్, ఇతర అధికారులపై దాడిని ఖండిస్తూ కలెక్టరేట్ వద్ద సోమవారం రెవెన్యూ ఉద్యోగులు నిరసన తెలిపారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమణ్‌రెడ్డి మాట్లాడుతూ.. వికారాబాద్ కలెక్టర్‌తో పాటు తహసీల్దార్, ఇతర ఉద్యోగులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో భాగంగా గ్రామానికి వెళ్లిన అధికారులపై క్రిమినల్స్ తరహాలో పలువురు మూకుమ్మడి దాడి చేయడం శోచనీయమన్నారు. ఈ దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేంత వరకు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లాలోని రెవెన్యూ ఉద్యోగులందరూ నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావడం ద్వారా తమ నిరసనను కొనసాగించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

వికారాబాద్ కలెక్టర్‌పై దాడిని ఖండిస్తున్నాం..

సుభాష్‌నగర్: వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై దాడిని ఖండిస్తున్నట్లు టీజీవో జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ తెలిపారు. కలెక్టర్‌పై దాడి హేయమైన చర్య అన్నారు. అధికారులపై దాడులు సరికాదన్నారు.

ఆర్టీసీ కార్గో సేవలపై అవగాహన

సుభాష్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ నూతనంగా ప్రవేశపెట్టిన ఇంటింటికి కార్గో సేవలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని ప్రధాన బస్టాండ్‌లో డిపో మేనేజర్ ఆనంద్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ఆనంద్ మాట్లాడుతూ హైదరాబాద్ జంట నగరాల్లో హోం డెలివరీ చేయబడుతుందని తెలిపారు. నమ్మకంగా, వేగంగా, భద్రంగా ఇంటికి వస్తువులను చేరవేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

సిరికొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవాల్గోట్ గ్రామంలో నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా పట్టుకున్నట్లు ఎస్సై ఎల్.రామ్ తెలిపారు. రాజేష్, వెంకటేశ్, సంతోష్, రమేష్‌ల వద్ద నుంచి 11వేల 370 రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తైక్వాండో క్రీడాకారులకు బ్లాక్ బెల్ట్

సుభాష్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పది మంది తైక్వాండో క్రీడాకారులు బ్లాక్ బెల్ట్ సాధించినట్లు జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి మనోజ్‌కుమార్ తెలిపారు. కూకట్‌పల్లి చాంపియన్స్ అకాడమీలో జరిగిన పోటీలలో జిల్లాకు చెందిన 10 మంది క్రీడాకారులు బ్లాక్‌బెల్ట్ సాధించినట్లు తెలిపారు. బ్లాక్‌బెల్ట్ సాధించిన వారిలో గోపి కృష్ణ, గంగాధర్, వేదాంత్, నిహాల్, వినాయక్, తనిష్క్, భావ్య, సహస్ర, వేద, ప్రవస్తిలు ఉన్నారు. బ్లాక్ బెల్ట్ సాధించడం పట్ల తైక్వాండో అసోసియేషన్ చైర్మన్ బస్వా లక్ష్మీనర్సయ్య, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

‘ప్రజావాణి’ వినతులను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, అధికారులు

నిజామాబాద్ అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ వినతులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో పాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, డీఆర్‌డీవో సాయాగౌడ్, ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్ తదితరులు జిల్లా నలు మూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈవారం ప్రజావాణి కార్యక్రమంలో అధికారులు 70 వినతులను స్వీకరించారు.

హాస్టల్‌లో భోజనం సక్రమంగా పెట్టడం లేదని ఫిర్యాదు..

ఆర్మూర్ బీసీ ప్రీమెట్రిక్ బాలికల హాస్టల్‌లో భోజనం సరిగ్గా పెట్టడం లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. కలెక్టర్‌ను కలిసి పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టడం లేదని ఇష్టం వచ్చినట్లు తిడుతున్నారని విద్యార్థుల చేత తరగతి గదులు శుభ్రం చేయించడం, కూరగాయలను కట్ చేయించడం వంటి పనులు చెబుతున్నారని తల్లిదండ్రులు తెలిపారు. స్నాక్స్ ఆహారం గురించి వార్డెన్‌ను ప్రశ్నిస్తే విద్యార్థులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని కావున వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

పోస్టింగ్ ఇవ్వడం లేదని వినతి..

డీఎస్సీ-2024 ఫలితాలలో నియామకపత్రం అందుకున్నప్పటికీ విద్యా శాఖ అధికారులు పోస్టింగ్ ఇవ్వడం లేదని నగరానికి చెందిన నవత ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఎస్జీటి లోకల్‌బాడిలో 203 ర్యాంకు వచ్చిందని అక్టోబర్ 9న ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామకం పత్రం ఇచ్చారని అక్టోబర్ 11న రిపోర్టింగ్ కోసం డీఈవో కార్యాలయానికి రాగా సాంకేతిక కారణాలు చెప్పి ఇప్పటికీ పోస్టింగ్ ఇవ్వలేదని ఇప్పుడు ఉద్యోగం లేదంటున్నారని తనకు పోస్టింగ్ ఇవ్వాలని కోరారు.

ఉద్యోగం ఇవ్వాలి..

శ్రీరాంసాగర్‌లో ఇళ్లు, ఎకరం వ్యవసాయ భూమి నష్టపోయిన తనకు ఉద్యోగం కల్పించి కుటుంబాన్ని ఆదుకోవాలని గజ్జెల సురేందర్ అనే వ్యక్తి ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. 2017లో పది మందికి విద్యార్హతలను బట్టి ఉద్యోగాలు ఇచ్చారని అప్పుడు తనను విస్మరించారని ఉద్యోగాల కోసం తిరిగితే కోటగిరి మండల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ పద్దతిలో ఉద్యోగం ఇచ్చారని అంతదూరం వెళ్లడం కష్టంగా ఉందని కావున తనకు ఏదైనా ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని కోరారు.

జిల్లా గ్రంథాలయంలో మధ్యాహ్న భోజనం ప్రారంభం


మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మధ్యాహ్న భోజనాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రారంభించారు. సోమవారం జిల్లా గ్రంథాలయంలో ఆయన గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డితో కలిసి అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజేతలుగా నిలవడానికి 18గంటలు గ్రంథాలయంలోనే ఉండి చదువుతున్నారని వారి కోసం మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ధన్‌పాల్ లక్ష్మీబాయి విఠల్‌గుప్త చారిటబుల్ ఆధ్వర్యంలో దాదాపు 200 మందికి పైగా మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందే నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతోని అని నిరుద్యోగులంతా ఏకమై ఆనాడు తెలంగాణ వస్తే తమకు కొలువులు వస్తాయని తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నారని కానీ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ పాలకులకు వరమైంది కాని నిరుద్యోగులకు మాత్రం ఎలాంటి లాభం చేకూరలేదని అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు గ్రంథాలయంలోని పుస్తకాలను సద్వినియోగపర్చుకొని ఉద్యోగం సాధించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ రాజరెడ్డి, అసిస్టెంట్ లైబ్రేరియన్ తారకం, ఇన్‌చార్జి సీనియర్ అసిస్టెంట్ నరేష్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రాజేశ్వర్, రికార్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలి: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి


సాంస్కృతిక ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

మోపాల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కంజర్ గ్రామ శివారులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న జోనల్ లెవెల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌ను ప్రారంభించారు. ఈ పోటీలు మూడు రోజుల పాటు జరుగనున్నాయని ఈ పోటీలో నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాలకు చెందిన 14 పాఠశాలల విద్యార్థినులు ఈ క్రీడల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మాలావత్ పూర్ణ, నిఖత్ జరీన్‌లు ప్రపంచ స్థాయిలో రాణించారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మంచి నైపుణ్యం గల క్రీడాకారులు ఉన్నారని విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలన్నారు. కులగణనతో ప్రజల ఆర్థిక, రాజకీయ, సామాజిక, ఉపాధి స్థితి తెలుసుకునేందుకు సర్వే చేపట్టడం జరుగుతుందని తెలిపారు. హాస్టల్‌లో చదువుకుంటున్న విద్యార్థులకు మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచడం జరిగిందన్నారు. విద్యార్థినులు సాంస్కృతిక నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ చంద్రశేఖర్‌గౌడ్, కళాశాల ప్రిన్సిపాల్ విజయ లలిత, పావని, సునీత, లత, నాగలత, రాజేంద్రప్రసాద్, సొసైటీ చైర్మన్‌లు మోహన్‌రెడ్డి, గంగారెడ్డి, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే.

మోపాల్ మండల కేంద్రంలో జరుగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సందర్శించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. రైతు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని రైతులకు వివరించారు. అలాగే మండల కేంద్రంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న కులగణన సర్వేను ఎమ్మెల్యే సందర్శించి అడిగి తెలుసుకున్నారు. సర్వేను ఇంటింటికి తిరుగుతూ సమగ్రంగా సర్వే చేయాలని అధికారులకు సూచించారు.

‘బీసీ కులగణనను అడ్డుకుంటే ధర్నా చేస్తాం’

నిజామాబాద్ అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీసీ కులగణన చేయడానికి వస్తున్న ఎన్యూమరేటర్లకు, అధికారులకు ప్రజలు సహకరించాలని ఎవరైనా కావాలని కులగణను అడ్డుకుంటే వారి ఇంటి ముందు ధర్నా చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణన చేస్తుంటే కొంత మంది అగ్రవర్ణాల పార్టీల నాయకులు అవాక్కులు, చెవాక్కులు వాగుతున్నారని ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అలాంటి నాయకులను బీసీ సంఘం నడిరోడ్డులో నిలదీస్తుందని వారిని చరిత్ర కూడా క్షమించదన్నారు. సమావేశంలో ఆంజనేయులు, కరిపె రవీందర్, దేవేందర్, శంకర్ పాల్గొన్నారు.

‘టీఎన్‌జీవో సభ్యత్వాన్ని ప్రతి ఉద్యోగి స్వీకరించాలి’

నిజామాబాద్ అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగి టిఎన్‌జీవో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని విధిగా రసీదు పొందాలని టిఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ కోరారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత కలెక్టరేట్‌లోని విద్యాశాఖ, ట్రెజరీ శాఖ, రెవెన్యూ శాఖలతో పాటు వివిధ శాఖల్లో టిఎన్‌జీవో సభ్యత్వ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కేంద్ర సంఘం అధ్యక్షుడు జగదీశ్వర్, కార్యదర్శి ముజీద్ హుస్సేనీ ఆదేశాల మేరకు సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్కరు విధిగా సభ్యత్వం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, చిట్టినారాయణరెడ్డి, పోల శ్రీనివాస్, దినేష్‌బాబు, ఉమాకిరణ్, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ అహమద్ అలీఖాన్‌కు అవార్డు

నిజామాబాద్ అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉర్దూ జర్నలిజంలో చేసిన కృషికి గాను జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ అహమద్ అలీఖాన్‌కు మహబూబా హుస్సేన్ జిగర్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ఇచ్చారు. అబ్దుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ఈ అవార్డులను అందజేశారు. అవార్డును సీఎం రేవంత్‌రెడ్డి అహమద్ అలీఖాన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్‌తో పాటు వివిధ అకాడమీల చైర్మన్‌లు పాల్గొన్నారు.

నగర పాలక సంస్థ కమిషనర్ సీసీగా రాకేష్

సుభాష్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్‌కు సీసీగా రాకేష్‌ను నియమించారు. మొన్నటి వరకు సీసీగా ఉన్న అంజాద్ ఖాన్ డిప్యూటేషన్‌ను రద్దు చేయడంతో నూతన సీసీగా రాకేష్‌ను నియమించారు. రాకేష్ నగర పాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ విభాగంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. సోమవారం రాకేష్ బాధ్యతలు స్వీకరించారు.

విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం పెరగాలి

మోపాల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమాజం మారాలంటే విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం పెరగాలని బాలోత్సవ ప్రతినిధులు నర్రారామారావు, రామ్మోహన్‌రావు, రవీంద్రనాథ్‌సూరిలు అన్నారు. సోమవారం మండలంలోని మోపాల్ ప్రెసిడెన్సి పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజుల పాటు జరిగే బాలోత్సవాలను అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నర్సింలు, ప్రమోద్, రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆజాద్ జయంతి సందర్భంగా క్రీడా పోటీలు

నిజామాబాద్ అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ నాయకుడు కైసర్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అకాడమి ద్వారా సోమవారం నగరంలోని రాజారాం స్టేడియంలో వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నుడా చైర్మన్ కేశవేణు హాజరై క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం ఖిల్లా రోడ్‌లోని నేషనల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు బుక్స్, యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మోయిన్ యూనుస్, అఫీస్, నవాజ్, తేజాబ్ పాల్గొన్నారు.


రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీకి వినతిపత్రం అందజేస్తున్న రియల్టర్లు

రిజిస్ట్రార్ పనుల్లో జాప్యాన్ని నిరసిస్తూ రియల్టర్ల ఆందోళన

- ఇద్దరు అధికారులను నియమించాలని వినతి

ఖిల్లా, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సకాలంలో పనులు జరగడం లేదని.. సబ్ రిజిస్ట్రార్ పనుల్లో జాప్యం చేస్తున్నాడంటూ సోయవారం పలువురు రియల్టర్లు ఆ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజామాబాద్ అర్బన్ సబ్ రిజిస్ట్రార్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. రిజిస్ట్రార్‌కు నచ్చిన విధంగా పనులు నిర్వహిస్తూ ప్రజలకు ఇబ్బందికరంగా మారారని తెలిపారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా మందగించి.. ఎలాంటి లావాదేవీలు జరగడం లేదన్నారు. అర్బన్‌లో ఇద్దరు అధికారులు ఉండాల్సిన చోట ఒక్కరే ఉండడం వల్ల పనులు సకాలంలో జరగడం లేదన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ రమేష్‌రెడ్డికి రియల్టర్లు వినతిపత్రం అందజేశారు. నిజామాబాద్ అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఇద్దరు అధికారులను నియమించాలని వారు కోరారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాం

- సన్నరకాలకు క్వింటా రూ.500 బోనస్
- డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలో సన్నరకంతో పాటు దొడ్డురకం ధాన్యం కొనుగోలు ప్రారంభించామని కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ రమేష్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్‌లో ఆయన విలేకరులత మాట్లాడారు. నిజామాబాద్ జిల్లాలో 670 కేంద్రాల వరకు ఏర్పాటు చేశామని వీటిలో సన్నరకాలకు 510 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు సుమారు లక్షా 40వేల క్వింటాళ్లు కొనుగోలు చేశామని అన్నారు. వీటిలో 60వేల క్వింటాళ్ల సన్నరకాలను నిజామాబాద్‌లో కొనుగోలు చేశామన్నారు. కామారెడ్డి జిల్లా పరిధిలో మొత్తం 580 కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. సన్నరకాలతో పాటు దొడ్డురకాలను మద్దతు ధరకు ఈ కేంద్రాల్లో కొనుగోలు చేస్తున్నామని ఆయన తెలిపారు. కామారెడ్డి జిల్లా పరిధిలో మొత్తం లక్షా 10వేల క్వింటాళ్ల వరకు కొనుగోలు చేశామని ఆయన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం సన్నరకాలకు బోనస్‌ను క్వింటాలుకు 500 రూపాయలు అందిస్తామని ఆయన తెలిపారు. మద్దతు ధర డబ్బులను ఖాతాల్లో జమ చేసిన తర్వాత సన్నరకాలకు ప్రత్యేకంగా అందిస్తామని ఆయన తెలిపారు.

తపాలా కార్యాలయాలకు నూతన భవనాలు

- కేంద్ర మంత్రికి ధన్యవాదాలు తెలిపిన ఎంపీ అర్వింద్

నిజామాబాద్ అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భీంగల్, నందిపేట, బాల్కొండ మండల కేంద్రాల్లో పోస్టాఫీస్ భవనాల కోసం ఇటీవల ఆయా మండలాల ప్రజలు ఎంపీ అర్వింద్‌ను కలిసి విన్నవించగా ఎంపీ అర్వింద్ నూతన భవనాల మంజూరుకు సంబంధిత కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు లేఖ రాయగా స్పందించిన మంత్రి మూడు మండలాలకు తపాలా కార్యాలయాల నూతన భవనాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తన విజ్ఞప్తుల మేరకు సానుకూలంగా స్పందించి తక్షణమే భవనాలు మంజూరు చేసిన కేంద్ర మంత్రికి ఎంపీ అర్వింద్ ధన్యవాదాలు తెలిపారు. తన పార్లమెంట్ ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలియజేశారు. తపాలా శాఖ అధికారులో సమన్వయం చేసుకొని సంబంధిత పత్రాలు త్వరగా పంపాలని ఆయన తెలిపారు.

కిటికి గ్రిల్ తొలగించి బంగారం చోరీ

ఖిల్లా, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నాల్గోటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని వినాయక్‌నగర్ సాయికృపనగర్‌లో ఆదివారం రాత్రి భారీ చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు ఇంటి కిటికికి ఉన్న గ్రిల్‌ను తొలగించి లోనికి చొరబడ్డారు. ఇంట్లోని బీరువాలో ఉన్న 32 తులాల బంగారు ఆభరణాలు, కిలో వెండిని అపహరించినట్లు బాధితులు రాములు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాములు తన భార్యతో కలిసి ఇంట్లో నిద్రిస్తుండగా మరో గది కిటికిలో నుంచి ఇంట్లో చొరబడ్డారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పరిసరాల్లో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఖిల్లా, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఐదవ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో రెండు చోట్ల టాస్క్‌ఫోర్స్ బృందం పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. మహ్మదీయ(హాష్మీకాలనీ)లో అఫ్సర్ అనే వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ బృందం పట్టుకున్నారు. ఖచ్చితమైన సమాచారం మేరకు మహ్మదీయ కాలనీలో తనిఖీలు చేస్తుండగా ఈ బియ్యం పట్టుకున్నారు. అదే విధంగా 50క్వార్టర్స్‌లో సుమారు 5టన్నుల అక్రమంగా నిలువ ఉంచిన పీడీఎస్ బియ్యంను టాస్క్‌ఫోర్ బృందం పట్టుకున్నారు. పట్టుకున్న బియ్యంను ఐదవ టౌన్ పోలీసు స్టేషన్‌లో అప్పగించారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.265	రూ. 285
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.270	రూ. 290

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.79900	రూ.73700	రూ.960

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : అమరన్ (12.00, 6.45, 10.15)
: క (3.30)
స్క్రీన్-2 : అమరన్ (10.00)
: అప్పుడో ఇప్పుడో ఎప్పుడో (1.30)
: లక్కీ భాస్కర్ (4.15, 7.30, 10.45)
స్క్రీన్-3 : సింగం అగేన్ (హిందీ) (10.50)
: ధూంధాం (2.00)
: అప్పుడో ఇప్పుడో ఎప్పుడో (5.00)
: జితేందర్ రెడ్డి (7.45)
: క (10.45)
స్క్రీన్-4 : బూల్ బులియా-3 (హిందీ) (10.00, 7.05)
: వంచన (1.25) : బ్లడీ బగ్గర్ (4.05)
: సింగం అగేన్ (హిందీ) (10.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : అప్పుడో ఇప్పుడో ఎప్పుడో (10.35)
: లక్కీ భాస్కర్ (1.30, 7.30)
: క (4.30, 10.30)
స్క్రీన్-3 : అమరన్ (10.30, 4.20, 7.30, 10.30)
: జితేందర్‌రెడ్డి (1.40)

దేవి : లక్కీ భాస్కర్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : అమరన్ (11.15, 6.15)
: సింగం అగేన్ (హిందీ) (2.15, 9.15)
విజయ్ : క (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్: దేవర (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్